శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## ధాన్య సేకరణ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ కోవూరు ఎమ్మెల్యే



**విడవలూరు, మార్చి 22, ప్రభాతవార్త :** రైతులకు అండగా టిడిపి ప్రభుత్వం ఉంటుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్న ప్రాధమిక సహకార సంఘ ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం అమ్ముకోవడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం ప్రకటించిన కనీస గిట్టుబాటు ధరగా 19 వేల 720 రూపాయలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పెద్ద రైతుల నుంచి ధాన్య సేకరణకు మొగ్గు చూపుతున్న అధికారులు చిన్న, సన్నకారు రైతులను పట్టించుకోవడం లేదన్న రైతుల ఆవేదనపై స్పందించారు. ధాన్యం సేకరణలో రైతుల పట్ల ఎటువంటి వివక్ష చూపవద్దని అధికారులను ఆదేశించారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీల కొరత గురించి రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెలపడంతో వెంటనే జాయింట్ కలెక్టర్‌తో ఫోన్ లైన్ ద్వారా మాట్లాడారు. ఇప్పటికే 32 మిల్లర్లతో ధాన్య సేకరణకు సంబంధించి ఒప్పందం కుదిరి వుందని అవసరమైతే ప్రకాశం, బాపట్ల పరిధిలోని మిల్లర్లను ధాన్య సేకరణ చేసేలా అధికారులు సమాయత్తం చేస్తున్నారన్నారు. రైతులకు న్యాయం చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించిన విషయాన్ని రైతులకు వివరించారు. గిట్టుబాటు ధరపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె ఎక్కడైనా అధికారులు సహకరించకపోతే తన దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, టిడిపి నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి,అడపాల శ్రీధర్ రెడ్డి, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, పురంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 33 వేల 275 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**- జాయింట్ కలెక్టర్ కార్తీక్**



**నెల్లూరు, కలెక్టరేట్, మార్చి 22,ప్రభాతవార్త** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 33,275మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కొల్లాబతుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం 4363.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 60.36 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించినట్లు జేసి తెలిపారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ధాన్యం డబ్బులు కూడా చాలా ఆలస్యంగా వస్తాయని, ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు రోజుల్లోనే డబ్బులు జమవుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు.

## ఉపాధి హామీ పథకం పేదలకు వరం

**- డ్వామా పిడి గంగాభవాని**



**ముత్తుకూరు, మార్చి 22, ప్రభాతవార్త** ఉపాధి హామీ పథకం పేదలకు వరమని డ్వామా పిడి గంగాభవాని పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ సామాజిక తనిఖీల ప్రజా వేదిక కార్యక్రమాన్ని శనివారం ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో మధ్యాహ్నం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పిడి గంగాభవానితో పాటు జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఏపిడిఓ గాయత్రి, వెంకట్ రెడ్డి, ఉపాధి హామీ ఏపిఓ వెంకటేశ్వర్లుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్వామా పిడి గంగాభవాని మాట్లాడుతూ 20 పంచాయితీల్లో దాదాపు పనులన్నీ బాగా జరిగాయని అన్నారు. ఎన్ఆర్‌జిఎస్ కింద జరిగిన పనుల్లో అక్కడక్కడ పొరపాట్లు జరగడంతో 29,251 రూపాయిలు సర్వశిక్షా అభియాన్ కింద జరిగిన వాటిలో లక్ష 94 వేల రూపాయిలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి మరో ఐదు రోజులు పనిదినాలు ఉన్నాయని ఇప్పటికే మండలంలో 82 శాతం పనులు జరిగాయని కనీసం 90 శాతానికి తీసుకొచ్చేందుకు ఈ ఐదు రోజులు కృషి చేయాలన్నారు. పంచాయితీలో ఒక ఇంటిలోని డబుల్ జాబ్ కార్డులు ఉన్నాయని, వాటిని తొలగించాలని చెప్పారు. ఉపాధి కూలీల కోసం ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పనులకు తూట్లు పొడవద్దని ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేట్లుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది

**-మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి**



**వెంకటాచలం,మార్చి 22,ప్రభాతవార్త :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం వెంకటాచలం వైసీపీ నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గత సంవత్సరం పుట్టి (850 కేజీలు) ధాన్యం 25వేల రూపాయలకు అమ్ముడుపోతే, నేడు కూటమి ప్రభుత్వంలో ధర 16 వేలకు పడిపోయింది. రైతులకు కనీసం గిట్టుబాటు ధర పుట్టి(850కేజీలు)కి 19,720/ రూపాయలు కల్పించవలసి ఉండగా, దళారులు పుట్టి (850 కేజీలు)16 వేలకు దోచుకుంటున్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇప్పించేందుకు అధికారంలో లేకున్నా, బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి, మద్దతు ధర ఇప్పించేందుకు కృషి చేస్తున్నాం. రైతులకు ధాన్యం అమ్మకాలలో గిట్టుబాటు ధర లభ్యం కాకపోతే, మా దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే, అధికారులతో మాట్లాడి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రయత్నిస్తాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారులను ఎవ్వరినీ విడిచిపెట్టం. అధికారులు అన్యాయంగా, అక్రమంగా ఎవరి పట్ల ప్రవర్తించినా, సంఘటితంగా అందరూ వెళ్లి అధికారులను నిలదీసి, అన్యాయాలను ఎదిరిద్దాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో స్థానిక నాయకులు, కార్యకర్తలు సూచనల మేరకు, బాధ్యత కలిగిన వారిని గుర్తించి, పార్టీ కమిటీలలో స్థానం కల్పిస్తాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటూ, కూటమి ప్రభుత్వంలో అవినీతి విధానాలను అసహ్యించుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు మండల వెంకట శేషయ్య,మండల కన్వీనర్ మోహన్ నాయుడు ఉప ఎమ్‌పిపి కన్నూరు కోదండ రామిరెడ్డి,కట్టంరెడ్డి శ్రీధర్ రెడ్డి,రోహిత్ రెడ్డి మండలంలోని అన్ని గ్రామాలలో నుంచి వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## కండలేరులో49.821 టీయంసీల నిటిమట్టం



**కండలేరుడ్యాం (రాపూరు), మార్చి22, ప్రభాతవార్త** : మండలంలోని కండలేరు జళాశయంలో శనివారం ఉదయం 6 గంటలకు 49.821 టీయంసీల నిటి మట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళశయంనుండి అవుట్‌ఫ్లోగా హెడ్ రెగ్యులేటర్ నుండి 650 క్యూసెక్కులు లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కుల చోప్పున మొత్తం 780 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఎఇ తిరుమలయ్య తెలిపారు.

## నగర సమగ్ర అభివృద్ధికి కృషి

- పెండింగ్ పనులు పూర్తికి చర్యలు
- పార్కుల ఆధునీకరణ పనులు పూర్తి
- నగరంలో 6 ఏసీ బస్టాండ్లను త్వరలోనే ప్రారంభిస్తాం



**నెల్లూరు, మార్చి 22, ప్రభాతవార్త-వైద్యం** గత ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన అన్ని పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసి నెల్లూరు నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. శనివారం తెల్లవారుజామున నెల్లూరు నగరంలో మంత్రి ఆకస్మికంగా పర్యటించారు. 9వ డివిజన్ నవాబు పేట, నజీర్‌తోట సమీపంలోని ఎస్‌సీఐ కాలనీలో పలు మున్సిపల్ పార్కులు, నవాబు పేట, పత్తివారి ప్రాథమిక పాఠశాల, బీవీఎస్ హైస్కూల్, తడికల బజారులోని ప్రాథమిక పాఠశాల, పార్కు ఏర్పాటుకు స్థలం, రేబాల వారిధిలో శిధిలావస్థలో ఉన్న రేబాల చిన్న పిల్లల ఆసుపత్రి భవనాలను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ 2014-19 మధ్యలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దామని, ప్లే, జిమ్, ఎక్విప్‌మెంటు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం పార్కులను పట్టించుకోకపోవడంతో క్రీడా సామాగ్రి పరికరాలు పనికి రాకుండా మూలకు చేరాయని చెప్పారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అప్‌గ్రేడ్ చేసి అత్యాధునిక వసతులతో చిన్నారులకు ఆనందం, ఆహ్లాదం పంచే విధంగా తయారు చేస్తున్నామని చెప్పారు. 54 డివిజన్లలో పార్కుల్లో జిమ్ ఎక్విప్‌మెంట్, ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు పనులు ఏప్రిల్ మొదటి వారంలో పూర్తి కానున్నట్లు చెప్పారు. రేబాల వారి వీధిలోని శిధిలావస్థకు చేరిన చిన్న పిల్లల ఆసుపత్రి స్థానంలో మంచి పార్కును నిర్మిస్తామని చెప్పారు. ఒక కమ్యూనిటీ హాల్, ఇండోర్ ప్లే ఎక్విప్‌మెంట్ ఉండేలా డిజైన్ చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అలాగే జూన్ 12లోగా పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో ప్లే, జిమ్, ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. వేసవిలో నెల్లూరు నగర ప్రయాణికులు చల్లగా సేద తీరేందుకు తమ ప్రభుత్వ హయాంలో 6 ఏసీ బస్టాండ్లు ఏర్పాటు చేశామని, అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్వాకంతో ఈ బస్టాండ్లకు తాళాలు వేసిందన్నారు. త్వరలోనే ఏసీ బస్టాండ్లను తిరిగి ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ కోసం తమ ప్రభుత్వ హయాంలో 1100 కోట్ల హడ్కో నిధులను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మంజూరు చేయగా, 90 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయలేదన్నారు. మళ్లీ ఇప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పెండింగ్ పనుల పూర్తికి త్వరలోనే 165 కోట్లు రూపాయలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు చెప్పారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని చెప్పారు. నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయం వద్ద ఘాట్ పనులను కూడా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డితో కలిసి పరిశీలించి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు రిపేర్లు చేసి ప్రారంభిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపార అనుభవంతో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులను పూర్తి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. మంత్రి వెంకట మున్సిపల్ కమీషనర్ సూర్యతేజ, అడిషనల్ కమీషనర్ నందన్, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## తప్పుడు ప్రచారాలతో రాజకీయ పబ్బం



**నెల్లూరు, మార్చి 22,ప్రభాతవార్త** మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ముసుగు తొలగించాలని, వీరి చలపతిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని టీడీపీ నాయకులు వంశీరెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ నాయకుడు వీరి చలపతి ప్రెస్‌మీట్‌లో చెప్పిన అబద్దాలను ఆయన ఎండగట్టారు. తప్పుడు ప్రచారాలతో రాజకీయ పబ్బం గడుపుతున్నారని అన్నారు. ఏఎంసీ పదవి ఎస్సీ రిజర్వేషన్ అంటూ మాట్లాడుతున్నారని, అసలు ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెప్పారు. ప్రభుత్వమే ఇప్పటివరకు ఎలాంటి గెజిట్ ఇవ్వకుంటే.. ప్రసన్నకుమార్‌రెడ్డి ఎందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఎస్టీ మహిళల రిజర్వేషన్‌ను ఎలా దుర్వినియోగం చేశారో కోవూరు ప్రజలందరికీ తెలుసన్నారు. చందన, చెంచమ్మ అనే ఎస్టీ మహిళలతో బలవంతంగా వారి పదవులకు రాజీనామా చేయించిన ఘనత మీకే దక్కుతుందన్నారు. కనీసం సిగ్గు లేకుండా తప్పుడు ప్రచారాలు చేసే మీరా బడుగు, బలహీన వర్గాల గురించి మాట్లాడేది అని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో అధికారంలో ఉన్నప్పుడు ప్రసన్న ఎస్సీ, ఎస్టీలకు ఎంతమాత్రం న్యాయం చేశారో చెప్పాలన్నారు. వేంరెడ్డి దంపతులపై తప్పుడు ప్రచారాలు చేస్తే పుట్టగతులు ఉండవని ఉన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సంతోషంగా ఉన్నారని ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు కనిపించడం లేదా అని అన్నారు. తాను జాబ్ కార్డు ద్వారా అక్రమాలు చేశారని చెప్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి.. దాని ద్వారా తాను ఒక్క రూపాయి లావాదేవీలు జరిగాయా అని ప్రశ్నించారు. ఎప్పుడో 2016లో వచ్చిన జాబ్ కార్డును ఇప్పుడు తీసుకువచ్చి రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇది బీపీఎల్ కుటుంబాలకు సంబంధించి ఇచ్చిన కార్డని, దీని ద్వారా అక్రమాలు జరిగితే దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, తప్పుడు కార్డు అయితే అప్పుడు ఎందుకు దీనిమీద మీరు మాట్లాడలేదని ప్రశ్నించారు. కోవూరు నియోజకవర్గంలో తప్పుడు ఏం లేకపోవడంతో మాట్లాడటానికి ఏం లేక.. ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారా అని అన్నారు. తోక పత్రికల్లో తప్పుడు రాతలు రాయిస్తున్నారని చెప్పారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 2017 నుంచి వేమిరెడ్డి దంపతులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, వైసీపీ హయాంలో కూడా వారు ప్రజా సేవ చేశారన్నారు. ఇదే ప్రసన్న కుమార్ రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ తరఫున అనేక పనులు చేయించుకున్నారన్నారు. అలాంటిది విపిఆర్ ఫౌండేషన్ పై అభాంగాలు వేయడం సరైంది కాదన్నారు.

## మోటార్‌సైకిల్ - ఆటో ఢీ ముగ్గురు వ్యక్తులు దుర్మరణం



**మనుబోలు మార్చి 22 ప్రభాతవార్త** మనుబోలు మండలంలోని వడ్లపూడి గొట్లపాళెం గ్రామాల మద్య మోటార్ సైకిల్ ఆటో ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. శనివారం పొదలకూరు నుండి వడ్లపూడికి వెళుతున్న ఆటోని వడ్లపూడి నుండి గొట్లపాలెం వైపు ముగ్గురు వెళుతున్న మోటార్ సైకిల్ ఎదురుగా వస్తున్న ఆటోను వేగంగా ఢీకొనడంతో మోటార్ సైకిల్ నడుపుతున్న నోసిన వరుణ్ సందేశ్ అతని స్నేహితుడు నందకుమార్,ఆటో డ్రైవర్ సురేంద్ర అక్కడిక్కడే మృతి చెందారు. క్షతగాత్రులని మెరుగైన వైద్య కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బైకు నడుపుతు మృతి చెందినవారు సైదాపురం మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. సంఘటన్నా స్థలాన్ని మనుబోలు ఎస్ఐ శివ రాకేష్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాల సుధాకర్‌కు సన్మానం



**నెల్లూరు రూరల్, మార్చి 22, ప్రభాతవార్త** ఉమ్మడి నెల్లూరు జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన సన్నిహితులు శ్రేయోభిలాషులుఎన్ఎంసి వాకర్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో సభ్యులు తల్లారి బాలసుధాకర్‌కి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ ఆఫీస్‌లో సభ్యులందరూ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ సభ్యులు మురళీకృష్ణం రాజు ఎంబెటి ఏసు నాయుడు, వడ్లమూడి శ్రీధర్, వాదనాల వెంకటరమణ, పాయసం రఘునాథ్, దోనేపర్తి బాబ్జి, బొమ్మిళ్ళ, బాల చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వలేటివారిపాలెంలో ఆక్రమణలు : పట్టించుకోని అధికారులు



**వలేటివారిపాలెం మార్చి 22, ప్రభాతవార్త** మండల కేంద్రమైన వలేటివారిపాలెం బస్టాండు సమీపంలోని రోడ్డుమార్జిన్‌ల వెంట గల ప్రభుత్వ స్థలం స్థలం ఆక్రమణలకు గురైంది.ఏళ్లతరబడి ఈ ఆక్రమణల పరంపర కొనసాగుతుంది. అత్యంత విలువైన ఈ స్థలం ఆక్రమణలకు గురవుతుంటే పంచాయతీ,రెవిన్యూ,ఆర్అండ్‌బీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇందులో బాగంగానే ఇటీవల లింగసముద్రం రోడ్డులో ఆక్రమణలకు గురైన సైడు కాలువ సైతం వివాదస్పదమైంది. అయినా రెవిన్యూ పంచాయతీ అధికారులు మొక్కుబడిగా ఉద్యోగం చేసుకుంటూ పోతునా న్నరే తప్ప ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి ్న కనీసం బాధ్యతను విస్మరిస్తున్నారు.దీంతో పామూరు రోడ్డు,కందుకూరు రోడ్డు, అంకభూపాలపురం రోడ్డులకు ఇరువైపుల ఆక్రమించుకొని రకరకాల కట్టడాలను నిర్మించుకున్నారు.రకరకాల షాపులు నిర్వహిస్తున్నారు.ఆక్రమణ దారులే హక్కుదారులుగా చలామణి అవుతున్నారు.ఇతరులకు సైతం అద్దెకు ఇస్తున్నారు.అదేమని అడిగే నాథుడే లేరు.వలేటివారిపాలెం నాలుగురోడ్ల కూడలి.మండల కేంద్రం.సమీపగ్రామాల నుంచి వివిద పనుల నిమిత్తం వలేటివారిపాలెంకు రాకపోకలు చేస్తుంటారు.పైగా పామూరు,లింగసముద్రం, కందుకూరు,అంకభూపాలపురం వైపులకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఉంది.బస్టాండు సెంటర్ వాణిజ్యకేంద్రంగా మారింది. రకరకాల షాపుల నిర్వహణతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో పామూరు, కందుకూరు రోడ్డులో మండల కాంప్లెక్స్ నుంచి బీసీ కాలనీ వరకు, అగ్రహారం రోడ్డువైపు బస్టాండు సెంటర్ నుంచి ఎస్సీకాలనీ వరకు ఇరువైపుల రోడ్డు మార్జిన్‌ల వెంటగల ప్రభుత్వభూమిని ఆక్రమణలకు గురైంది. రకరకాల షాపుల ఏర్పాటుతో వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది.ఏళ్లతరబడి ఆక్రమణలు కొనసాగుతుండడంతో తొలగించే సాహసం ఎవరూ చేయడం లేదు.పంచాయతీ వారు కనీసం పన్ను కూడా కట్టించుకోవడం లేదు. దీంతో పంచాయతీకి ఆదాయం రావడం సంగతి దేవుడెరుగు...స్థలంపై గల హక్కే ప్రశ్నార్ధకమైంది.ఆక్రమణదారులును తొలగించడానికి ప్రయత్నం చేస్తే కోర్టుకు వెళ్లే స్టే తెచ్చుకోవాలన్న ఆలోచనలో ఉన్నారు.

**గదుల కాంప్లెక్స్ నిర్మించాలి::** నాలుగు రోడ్లకి ఇరువైపుల గల పంచాయతీకి చెందిన స్థలంలో గ్రామపంచాయతీనే గదుల కాంప్లెక్స్ నిర్మించి అర్హులైన వారికి అద్దెకు ఇస్తే లాభదాయకంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.ఆ దిశగా ఆలోచించాలని పలువురు సూచిస్తున్నారు.అదే విధంగా రామన్న చెరువులోని చిల్లకర్ర అమ్మకంలో పారదర్శకతను బహిరంగ పరచాలని పలువురు సూచిస్తున్నారు.

## సంగం హైవేపై తప్పిన పెను ప్రమాదం






**సంగం మార్చి 22 ప్రభాతవార్త** సంగం ఊరిలో నుండి జాతీయ రహదారిపై కి వచ్చిన ఆర్టీసీ బస్సును కొండపై నుండి వస్తున్న లారీ ఢీకోవడం జరిగింది. అయితే ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

## తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు వేతనాలు పెంచాలి



**పొదలకూరు, మార్చి 22, ప్రభాతవార్త :** తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పనిచేస్తున్న డ్రైవర్ వేతనాలను పెంచాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు జక్కా మహేష్, ట్రెజరర్ మెంబర్ ఎస్‌కె మస్తాన్ ప్రభుత్వాని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31 వ తేది తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ టెండర్లు ముగిస్తాన్నాయని గత 9 సంవత్సరాలుగా రూ. 7870 జీతనికే పని చేస్తునమన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పని చేస్తున్న తమను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని కొత్త టెండర్లు వేసి జీతలను పెంచాలని కోరారు.

## ఉపాధి పనులు పరిశీలన



**వరికుంటపాడు,మార్చి22, ప్రభాత వార్త :** జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్క రూ సద్వినియోగం చేసుకోవా లని గణేశ్వ రాపురం టీడీపీ నాయ కులు పేరం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం గణేశ్వరాపురం గ్రామంలో జరు గుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని జి.కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాది పనులను ఏపీవో అజంఖాన్ తనిఖీ చేశారు. మస్టర్‌లను పరిశీలించి హాజరైన కూలీల వివరాలను తనిఖీ చేశారు. పనికి తగ్గ వేతనం కాబట్టి కొలతలు ప్రకారం పని చేయాలని కూలీలకు సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక సద్వినియోగం చేసుకోండి



**వరికుంటపాడు, మార్చి 22, ప్రభాతవార్త :** 24న సోమవారం వరికుంటపాడు మండల తహశీల్దార్ కార్యాలయం నందు నిర్వహించు ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం నందు మండల స్థాయి అధికారులందరూ హాజరవుతున్నందున మండల ప్రజలు తమతమ సమస్యలను అర్జీలు అందించి, సమస్యలను పరిష్కరించుకోగలరని తహశీల్దార్ హేమంత్ కుమార్ పేర్కొన్నారు. అలాగే ప్రతి శాఖకు సంబంధించిన మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాల న్నారు.

## బైకును ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు



**వరికుంటపాడు ,మార్చి 22, ప్రభాతవార్త :** వేగంగా వెళ్తూ ముందు ఉన్న కారు ఢీకొట్టగా ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన వరికుం టపాడు బస్టాండ్ సెంటర్లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రఘునాథ్ తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై వరికుంటపాడు సెంటర్ వద్ద వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టి ందని ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. పల్నాడు జిల్లా భీమవరం గ్రామానికి చెందిన కృపారావు, జ్ఞానయ్యల పొగాకు పనుల నిమిత్తం ప్రకాశం జిల్లా సింగరాయకొండకు వచ్చారని, అయితే నెల్లూరు జిల్లా మరిపాడు మండలం పొంగూరులో ఉన్న తన బంధువుల వద్దకు వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా, దుత్తలూరు నుండి లింగసముద్రం వెళ్తున్న కారు వరికుంటపాడు బస్టాండ్ సెంటర్ వద్ద బైక్‌ను ఢీకొట్టగా ఆ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వారు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సమయపాలన తప్పనిసరి

**నెల్లూరు, మార్చి 22, ప్రభాతవార్త-వైద్యం :** ఆరోగ్య సహాయకులు విధులు సక్రమంగా నిర్వహించడమే కాకుండా సమయపాలన ఖచ్చితంగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వంగల సుజాత సూచించారు. జిల్లాలోని పురుష ఆరోగ్య సహాయకులకు డీఎంహెచ్ఓ సుజాత ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులు నివారణపై కెపాసిటి బిల్డింగ్, రిఓరియెంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆరోగ్య సహాయకులు విధులను సక్రమంగా నిర్వహించాలని ఎఫ్ఆర్ ఎస్ నమోదులో సమయ పాలన ఖచ్చితంగా పాటించాలని అన్ని రకాల వ్యాధుల నివారణ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. మలేరియా ఇతర కీటక వ్యాధల నివారణలో చురుకుగా పాల్గొనాలని తెలియజేశారు. అనంతరం డీఎంహెచ్ఓ హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వ్యాధికారిక క్రిములు, వ్యాధి వ్యాపింపచేయు దోమల గురించి, మలేరియా రక్త పూతలు తీయు విధానంపై చికిత్స పద్ధతలు గురించి నివారణ మార్గాలపై లార్వా సర్వే ఫీవర్ సర్వే గురించి వివరించారు. అనంతరం సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు మాట్లాడుతూ ఆరోగ్య సహాయకులు విధులు, వారి లక్ష్యాలు, వారు మైంటెన్ చేయాల్సిన రిజిస్టర్‌ల స్ప్రే పద్ధతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్లు, ఆరోగ్య సహాయకులు డీఎంఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దౌర్జన్యానికిపాలు పడిన వారిపై చర్య తీసుకోండి



**మనుబోలు మార్చి 22 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని వీరంపల్లి పంచాయితీ కొండుపాళెం గ్రామంలోని అరుంధతీపాళెం కు చెందిన గుండుపాక మీరమ్మ గత గురువారం రాత్రి తమ పొలంలో మిషన్తో వరి కోతలు కోసి ధాన్యాన్ని ట్రాక్టర్లో తోలు తుండగా అదే గ్రామానికి చెందిన ఆనాల సీనయ్య , ఆనాల సతీష్ , ఆనాల లలితమ్మ మరియు వాళ్ళు బందువైన వాసు కారులో వచ్చి దాన్యంతో స్వాధీనం చేసుకున్నారని విషయం తెలుసుకున్న మీరమ్మ అక్కడికి చేరుకోగా ఆమె పై విచక్షణా రహితంగా దాడి చేసి అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషించారని అదే రోజు రాత్రి మనుబోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ఆగ్రహం చెందిన నలుగురు ఆమె పొలంలో మిగిలి ఉన్న వరి కోతను జరగనివ్వకుండా అడ్డుపడ్డారు. విషయం తెలుసుకున్న కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘురామయ్య మరియు కార్యదర్శులు ఆలూరు తిరిపాలు అధ్యక్షతన శుక్రవారం రాత్రి మరలా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.బాధితురాలికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.దాడి చేసి తీసుకెళ్లిన రెండు పుట్లు ధాన్యం ఇప్పిస్తు ఇంతటి దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా అధికారులు ఎవ్వరు స్పందించలేదని దళితులు గిరిజనులపై దాడులను ప్రోత్సహిస్తున్నారని జస్టిస్ కె పున్నయ్య కమీషన్ కమీటి సిఫార్సుల మేరకు ఎస్‌సి ఎస్‌టిలపై దాడులు జరిగిన వెంటనే అధికారులు గ్రామంలోకి వెళ్ళి బాధితులకు అండగా నిలవాలని రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈవిషయమై శనివారం తహసిల్దారు సిహెచ్ సుబ్బయ్యకి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కెవిపిఎస్ అధ్యక్షులు బిసి బాస్కర్, ఐటియు మండల కార్యదర్శి సిహెచ్ ఆదిశేషయ్య, సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ ఆదిశేషయ్య, సిసిఎం మండల కార్యదర్శి తలారి దేవదానం శరత్‌బాబు డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు దేహదారుఢ్యానికి మానసికోల్లాసానికి దోహదపడుతాయి




**కావలి, మార్చి22 ప్రభాతవార్త :** క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదప దుతాయని కావలి డిఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి పట్టణ అఫిషియల్ క్లబ్‌లో కావలి టెన్నిస్ టోర్నమెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ టెన్నిస్ టోర్మమెంట్‌ను ఆయన ప్రారంభిం చారు. డాక్టర్ సిఎల్ఎన్ రెడ్డి, సృజనమ్మ చారిటబుల్‌ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్ మాట్లాడారు. ఈ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్‌నందు ఒరిస్సా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి 75 టీమ్‌లు పాల్గొనడమే కాకుండా అత్యధికంగా కావలి పట్టణం నుండి పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలియచేశారు. టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించడంలో కావలికి మంచి గుర్తింపు ఉందని, దీనిని కొనసాగించాలని ఆయన కోరారు. ఫుట్‌బాల్ అటతర్వాత మంచి ఫిట్‌నెస్ ఉన్న ఆట టెన్నిస్ అన్నారు. ఈ టెన్నిస్ ఆట శక్తిసామర్థ్యంతోపాటు మంచి ఆరోగ్యం కూడా ఉంటుందన్నారు. ఈ క్రీడలు కావలికి మంచి గుర్తింపు తేవాలన్నారు. నేషనల్ లెవెల్‌లో ఎక్కడ టోర్నమెంట్ జరిగినా కావలి ప్రాంతం నుండి వెళ్లి ప్రత్యేక గుర్తింపు తేవాలన్నారు.రానున్న రోజుల్లో కూడా ఈ క్రీడలను కొనసాగించాలన్నారు. అన్ని వయసులవారు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్, తహశీల్దారు శ్రావణ్‌కుమార్, టోర్నమెంట్ అధ్యక్షులు అనుమాలశెట్టి రామకృష్ణ, కార్యదర్శి విజయశంకర్‌రెడ్డి, నిర్వాహకులు పిడి డాక్టర్ ప్రసాదరెడ్డి, జగదీష్, ప్రసాద్, రమణయ్య, శ్రీధర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీకి అధికారం ముఖ్యంకాదు... ప్రజల సంక్షేమమే ముఖ్యం



**కావలిరూరల్, మార్చి22 ప్రభాతవార్త ;** కాంగ్రెస్‌పార్టీ దేశప్రజలకోసం, ప్రయోజ నాల కోసం అనేకసార్లు పరిపాలించిందని, పార్టీకి అధి కారం ముఖ్యంకాదని, ప్రజలసంక్షేమమే ముఖ్య మని కాంగ్రెస్‌పార్టి జిల్లా అధ్యక్షులు చేవూరి దేవకుమార్‌రెడ్డి తెలియచేశారు. కాంగ్రెస్‌పార్టీ కావలినియోజకవర్గ ఇన్‌చార్జి పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో కావలి రామ్మూర్తిపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంనందు శనివారం కావలి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముందు కావలి ట్రంకురోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడారు. దేశంలోని ఎన్‌డిఎ కూటమిలోని ప్రధాని నరేంద్రమోడి పాలనచూస్తే మతతత్వం, కులతత్వం, మత విద్వేషాలను రెచ్చగొట్టే ఒకే ఒక ఎజెండా మాత్రమే కనిపిస్తుందని తెలియచేశారు. కాంగ్రెస్‌పార్టీ మాత్రం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి పేదవారిని గుర్తించడం జరిగిందని తెలియచేశారు. ప్రాంతీయ పార్టీలు ఒకటే తెలుసుకోవాలని ఏ పార్టీ మేలుచేస్తుందో గ్రహించినరోజే ప్రజలు సంతోషంగా ఉంటారని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర విభజన అనంతరం విభజన చట్టంలో కాంగ్రెస్‌పార్టీ పెట్టిన అన్ని అంశాలు బిజెపి పార్టీ నీరుకార్చిందన్నారు. విభజన హామీలను నిర్వహించాలని పార్లమెంట్ సాక్షిగా కాంగ్రెస్‌పార్టీ గగ్గోలు పెట్టిందన్నారు. ప్రధానమంత్రి మోడి, ముఖ్యమంత్రులు నితిష్‌కుమార్, నారా చంద్రబాబునాయుడుల దయతో కేంద్రంలో అధికారంలో ఉన్నారని విభజనచట్టంలోని అన్ని అంశాలు నెరవేర్చుకునేందుకు నారా చంద్రబాబునాయుడుకు అవకాశముందని తెలియచేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధి కుటుంబంచేసిన ప్రాణత్యాగానికి ప్రజలందరూ ఆ కుటుంబానికి అండగా ఉండాలన్నారు. బిజెపి ప్రభుత్వంలో ఏమి మాట్లాడినా కేసులు పెడుతున్నారని ఇది నిరంకుశపాలన అన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో ఉన్నవారంతా కాంగ్రెస్‌పార్టీవారేనని తిరిగి కాంగ్రెస్‌పార్టీలకి రావాలని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డికూడా కాంగ్రెస్‌పార్టీలోకి వస్తారన్నారు. కాంగ్రెస్‌పార్టీ అందరిపార్టీ అని అందరిని ఆదరిస్తుందని తెలియచేశారు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, ప్రజల్లోకి వెళితే మంచి ఆదరణ ఉంటుందని తెలియచేశారు. ఈ దేశంకోసం కాంగ్రెస్‌పార్టీ ఎన్నో చేసిందని బిజెపికి, కాంగ్రెస్‌పార్టీకి 30, 40 సీట్లు తేడా మాత్రమేనని తెలియచేశారు. ఈ రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌పథకాలు అన్నారని, సూపర్‌సిక్స్‌లో సూపర్ ఫోర్ కనబడడంలేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు అవుతుందని ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో ప్రజలకు తెలియచేయాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ చెప్పిన మూడు నెలల్లో కర్నాటక, తెలంగాణాలో హామీలను నెరవేర్చిందని తెలిపారు. గతంలో నారా చంద్రబాబునాయుడు ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలు వద్దని అన్నారని ప్రస్తుతం మాత్రం ఎంతమందినైనా కనండని తల్లికి వందనం ఇస్తానన్నారని తెలిపారు. ఆ తల్లికి వందనం ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు.
-కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి పొదలకూరి కళ్యాణ్ మాట్లాడారు.కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలందరూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియచేశారు. కావలి గడ్డ అంటేనే కాంగ్రెస్‌పార్టీ అడ్డా అని కావలి నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి అందరూ కృషిచేయాలని కోరారు. ఇప్పుడు ఉండే జనరేషన్‌కు కాంగ్రెస్‌పార్టీ ఏమిచేసిందో తెలియకపోవచ్చని గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్ర ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ హామీలను నమ్మి ప్రజలు బాధపడుతున్నారని తెలియచేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారంలో లేనపుడు ఒకవిధంగా, అధికారంలోకి వచ్చాక మరొక విధంగా మాట్లాడుతున్నారని ఆయన చెప్పిన హామీలన్నీ నెరవేర్చాలని తెలియచేశారు. అనంతరం పార్టీలోని పలువురికి పార్టీకి సంబంధించిన పదవుల నియామకపత్రాలను అందచేయడం జరిగింది. పార్టీ నాయకులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.సురేష్, కావలి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మానస, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్ తనిఖీ చేసిన ఎంఎస్‌డబ్ల్యూ



**మనుబోలు మార్చి 22 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలు బాలికల హాస్టల్‌ని ఎఎస్‌డబ్ల్యూ ఓ బ్రహ్మానందచారి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పదోవతరగతి పరీక్షలు జరుగుతున్న నేపద్యంలో తాను బాలికల హాస్టల్‌కు వచ్చి విద్యార్ధినిలు ఏ విధంగా పరీక్షలు రాస్తున్నారో అని అడిగి తెలుసు కోవడం జరిగిందని అన్నారు. సోమవారం గణిత పరీక్ష ఉన్నందున విద్యార్దులు గణిత పరీక్షలకు ఎలా తయారు అవుతున్నారో తెలుసుకోవడం జరిగిం దని అన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాసి హాస్టల్‌కి మంచి పేరు తీసుకొని రావాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట వసతి గృహ సంక్షేమాధికారిణి కూడా ఉన్నారు.

## శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ ప్రకృతి వరం



**బుచ్చి మార్చి 22 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ ప్రకృతి వరం అని నెల్లూరు రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి ప్రశంసించారు. శనివారం పాఠశాలలో ఫ్రూట్స్ దే కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ నేతృత్వంలో నిర్వహించారు.ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గోన్న సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరు నిత్యం పండ్లు తినాలని ఆయన సూచించారు. పండ్లు తినడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.అనంతరం డాక్టర్ ఎన్ రాజు మాట్లాడుతు శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో ప్రతి కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తారని అన్నారు. ఫ్రూట్స్ దే కార్యక్రమం నిర్వహించి విద్యార్దులకు వాటి ఆవశ్యకత గురించి వివరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాలలో ప్రదర్శనకు వుంచిన వివిధ రకాల పండ్లు చూసి అతిధులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ. ఉపాధ్యాయులు, విజయలక్ష్మీ, గిరిజ, విద్యార్దులు తదితరులు పాల్గోన్నారు.

## ధ్వంసమైన కెనాల్ బ్రిడ్జి ప్రదేశాన్ని పరిశీలించిన రైతు సంఘం నేతలు



**దగదర్తి, మార్చి 22, ప్రభాతవార్త :** దగదర్తి మండలంలో డియర్ ఛాన ల్(దగదర్తి- రాచర్ల పాడు) కెనాల్ బ్రిడ్జి ని ధ్వంసం చేసిన ఘటనపై శనివారం రైతు సంఘం నేతలు పలువురు ఆ ప్రదేశానికి వెళ్లి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు ఉపాధ్యక్షులు చాంద్ర రాజగోపాల్, రైతు సంఘ జిల్లా అధ్యక్షులు పులిగర్ల శ్రీరాములు, జిల్లా సహకార కార్యదర్శులు గోపసాని రమేష్ తదితరులు మాట్లాడుతూ దగదర్తి రాచర్లపాడు కెనాల్ పనులు గడిచిన నాలుగు సంవత్సరాల నుండి చేయకుండా ఇప్పుడు సోమశిలలో నీరు పుష్కలంగా ఉండి రైతులు పండించుకోవాల్సిన రెండో క్రాపు సమయంలో బ్రిడ్జిని కూల్చడం అమానుషం అని పేర్కొన్నారు. తొలి పంటలో వాతావరనం అనుకూలించక రైతులు నష్టపోవడం జరిగింది. రెండో పంటలోనైనా నష్టాన్ని పూడ్చుకోవాలని రైతులు ఉత్సాహంగా ఉన్న తరుణంలో రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా బ్రిడ్జిని కూల్చి రైతుల మనోభావాలు దెబ్బతీసేలా చేశారని, ఈ విషయంపై అధికారులు దగదర్తి మండల రైతులకు న్యాయం జరిగే విధంగా పనులు చేపట్టాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వీరితో పాటు దగదర్తి మండల రైతులు ఉన్నారు.

## పట్టపగలే ఇళ్లల్లో చోరీ





**వరికుంటపాడు ,మార్చి 22, ప్రభాతవార్త :** జాతీయ రహదారి వెంబడే ఉన్న ఇంటిల పట్టపగలే చోరీ జరిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వరికుంటపాడు మండలం భోగ్యవారిపల్లి గ్రామానికి చెందిన భోగ్యం నాగభూషణం జాతీయ రహదారి వెంబడి ఊరు చివరన ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు. అలాగే సెంటర్ నందు కూల్ డ్రింక్ షాపు నిర్వహించుకుం టున్నారు. ప్రతి రోజు ఉదయం దుకాణానికి వెళ్లి మధ్యాహ్నం భోజనానికి వచ్చే వాళ్ళని, రోజు లాగే శనివారం మధ్యాహ్నం భోజనానికి రాగా అప్పటికే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. ఇంటిలో ఉన్న రెండు బీరువాలను పగలగొట్టి ఉండడం అందులోని వస్తువులను చెల్లాచెరుదుగా కింద పడ వేసి ఉండడంతో గురయ్యారు. బీరువాలో పది వేల నగదు, 10 తులాల వెండి నగలు ఉన్నాయన్నారు. వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రఘునాథ్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎవరు వస్తువులు తాకవద్దని క్లూస్ టీమ్ వారు వచ్చి పరిశీలిస్తారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం



**వింజమూరు, మార్చి 22, ప్రభాతవార్త :** వింజమూరులో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సుమారు రెండు శతాబ్దాల క్రితం ఏర్పడిన పార్టీగా ఆవిర్భవించి ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పడి లేచిన కెరటంలా దేశంలో, రాష్ట్రాలలో పరిపాలన చేపట్టనుందని పేర్కొన్నారు. శనివారం ఉదయగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చినటువంటి సూపర్ సిక్స్ పథకాలలో సుమారు ఫోర్ మిగిలిపోయాయయని వాటిని ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. గతంలో అందరూ కాంగ్రెస్ పార్టీలో నుండి పదవులు అనుభవించిన వారేనని తదుపరి తమ తమ అభిప్రాయాల మేరకు పార్టీని విడిపోయారని అయినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీకి కనుమరుగయ్యేది కాదని అన్నారు. ఇప్పటికి పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులు అందరూ ఉన్నారన్నారు. ప్రస్తుతం పార్టీ జిల్లా కమిటీలతో పాటు మండల కమిటీలను కూడా ఏర్పాటు చేసి పార్టీకి పూర్వవైభవం తెస్తామని రానున్న ఎన్నికల్లో ఎన్నికల్లో పార్టీ ఘన విజయం దిశగా నడిచేందుకు కృషి చేస్తారన్నారు. ఉదయగిరి నియోజకవర్గం ప్రజలు ఎంతో తెలివైన వారిని ఆలోచనపరులని ఆయన అన్నారు. అదే విధంగా డీసీసీ అధ్యక్షులు చేవూరు దేవ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నూతన ఉత్తేజాన్ని నెలకొల్పేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఈ కమిటీలు గ్రామ స్థాయి నుండి కమిటీలను వేసి కార్యకర్తలకు మమేకమై పని చేస్తూ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ హయాంలోనే పేదలకు పక్కా ఇల్లు భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ జాతీయ బ్యాంకుల క్రమబద్ధీకరణ తదితర సంక్షేమ సంస్కరణలను అమలుపరిచినటువంటి వ్యక్తిగా పేరుపొందారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఆరాచక శక్తులను పోషిస్తున్నారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో అరాచక శక్తులను పోషిస్తున్నారని, దేశ ఆస్తులను ఇద్దరు వ్యక్తుల చేతిలోకి మళ్లించి పాలన సాగిస్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులను ప్రకటించింది డీసీసీ అధ్యక్షులుగా చేవూరు దేవకుమార్ రెడ్డి ఉపాధ్యక్షులుగా ఎల్.సురేష్, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, బాల సుధాకర్‌లు జనరల్ సెక్రటరీగా సత్తెనపల్లి బాలయ్య, సెక్రటరీగా నాగరాజు, రత్నాలరెడ్డిలను ప్రకటించారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల అధ్యక్షులను ప్రకటించారు. సీతారాంపురం హజరత్ బాబు ఉదయగిరి బాబురావు, దుత్తలూరు వెంకటేశ్వరరెడ్డి, వరికుంటపాడు ఓసీ వింజమూరు జగదీశ్‌రెడ్డి, కలిగిరి బాలాజీ, కొండాపురం విజయకుమార్‌లను ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్, నరసింహులు, నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

## ఉదయగిరి వద్ద రోడ్డు ప్రమాదం నలుగురికి గాయాలు



**ఉదయగిరి, మార్చి 22, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గన్నేపల్లి సమీపంలో రెండు బైకులు ఢీకొనడంతో నలుగురికి గాయాలు పాలయ్యారు. మండలంలోని గన్నేపల్లి సమీపంలోని హైవే వద్ద ఉదయగిరి పట్నానికి చెందిన చాంద్ భాషా మస్తాన్ కాలేశాలు ఓ బైక్‌పై కృష్ణంపల్లి సమీపంలోని పొలం వద్దకు వెళ్తున్నారు. అదే మార్గంలో మస్తాన్ అనే వ్యక్తి బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నలుగురు గాయపడగా 108 వాహనంలో ఉదయగిరికి తరలించారు. హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు.

## శకునాలపల్లిలో ఫారంపాండ్‌కు భూమిపూజ



**ఉదయగిరి, మార్చి 22, ప్రభాతవార్త :** ఉదయగిరిమండల పరిధిలోని శకునాలపల్లి గ్రామంలో గల సచివాలయం పరిధిలో ఫారం పాండ్‌కు భూమి పూజ ఎంపీడీఓ జనసేన నాయకులు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పండ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాలు పెంపొందించవచ్చని ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతున్నారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పాజీ, ఏపీవో శ్రీనివాసులు, జనసేన నాయకులు కల్లూరు సురేందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు టీఏలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చారు.. అమలు పరిచారు..



**ఉదయగిరి, మార్చి 22, ప్రభాతవార్త :** ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాలతో ఆర్అండ్‌బి అధికారులు , మండల నాయకత్వం కదిలింది. మండల కన్వీనర్ సీహెచ్ బయన్న ఆధ్వర్యంలో నేషనల్ హైవే యంత్రాంగం సారధ్యంలో ఆర్అండ్‌బి అధికారుల నేతృత్వంలో ఉదయగిరి పట్టణం నుండి సీతారాంపురం వెళ్లే హైవే ప్రధాన రహదారి వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర రోడ్డుకు ఇరువై పులా ఉన్న కర్ర తుమ్మ చెట్లను శుక్రవారం తొలగించి, రవాణాకు, వాకింగ్ ప్రియులకు, సౌకర్యవంతంగా చేశారు. శివరాత్రి సందర్భంగా ఘటిక సిద్దేశ్వరం వెళ్లి వస్తున్న తరుణంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్ తొలగించి, సౌకర్యవంతం చేయాలని ఉదయగిరి వాసులు విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట ఇచ్చారు అమలు పరిచారు. దీంతో పట్టణ వాసులు కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జ నరసింహులు, చింతల బోయిన బాలకృష్ణ, ఉప్పుటూరు వెంకటయ్య, వీర రమణయ్య, వరికూటి రామ్‌మోహన్ తదితరులు ఉన్నారు.

## రాపూరులో ఎమ్మార్పిఎస్ సంబరాలు




**రాపూరు,మార్చి22ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని ఆరుంధతీయ వాడలో ఎమ్మార్పిఎస్ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణలో విజయం సాధించి నందుకు ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వమిం చారు.అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు.ఎస్సీ వర్గీకరణ ద్వారా రాబోయో తరలలో మాదిగ సోదరులకు విద్యా, ఉద్యోగం,రాజకీయ రంగాలలో అనేక అవకాశాలు వస్తాయని పెద్ద ఎత్తున మాదిగ యువతకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మాదిగ ఉప కులాలు అన్ని ఒకే తాటిపై వుండాలని కోరారు. ఎంఎస్పీ ఇన్‌చార్జ్ చింతగుంట అంకయ్య మాదిగ,ఎమ్మార్పిఎస్ నాయకులు పచ్చిగళ్ళ ప్రేమ్ కుమార్,మంగళపూరి వెంటేష్ ఆదూరి దేవరాజు, కొత్త కార్తిక్,పచ్చిగళ్ళ బాబు, చింతగుంట శ్రీనివాసులు, తాడి రాజా, పామర్తి ఆశీర్వాదం, పచ్చిగళ్ళ విజయ, ఎసుపోగు పెంచలయ్య, పచ్చిగళ్ళ వెంకటరమణ ,పలువురు ఎమ్మార్పిఎస్ నాయకులు ,కార్తకర్తలు తదితరులున్నారు.

## మాలకొండ ఆదాయం రూ.7.3లక్షలు



**వలేటివారిపాలెం మార్చి 22, ప్రభాతవార్త :** మండలంలోని మాలకొండ నందలి శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించుకున్నారు.తద్వారా సా ్వమివారికి రూ.7,03,980లు మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ భక్తులకు తీర్థప్రసాదాలు అ ందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.7,950లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.17,520లు,తలనీలాలు టిక్కెట్లు వలన రూ.28,575లు,వాహనపూజల వలన రూ.2,500లు,ప్రత్యేకదర్శనం రూ.1,78,600లు,స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.660లు,రూముల అద్దెలు రూ.33,280లు,కవర్లు అమ్మకం వలన రూ.5,700లు, అన్నదానం నిమిత్తం రూ.1,59,349లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,64,730లు,విరాళాలు రూ.1,05,116లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు.

## హెల్మెట్ పెట్టుకొని వాహనాలు నడపండి

**- ఎస్ఐ సంతోష్‌రెడ్డి**



**బుచ్చి మార్చి 22 ప్రభాతవార్త ఫ** ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకొని వాహనాలు నడపాలని బుచ్చిరెడ్డిపాళెం ఎస్ఐ సంతోష రెడ్డి సూచించారు. టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినందువల్ల ప్రమాదాలు జరిగినప్పుడు మృత్యువాత పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అలాగే యువకులు ముగ్గురు, ముగ్గురు బైకులో ఎక్కి హైవేలపైన ఇష్టానుసారంగా మోటార్‌బైకు నడిపి ప్రమాదా లకు గురౌతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దయచేసి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకొని ప్రయాణాలు చేయాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు మైనర్ బిడ్డలకు మోటార్‌బైకులు ఇవ్వకండని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## 31లోగా తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలి

**బిట్రగుంట మార్చి 22(ప్రభాతవార్త) :** మండలంలోని రేషన్ కార్డు వినియోగదారులు కుటుంబసభ్యులుతో సహా అందరు మార్చి 31 లోగా ఈకెవైసి చేయించుకోవాలని మండల తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. ఉన్నతధికారుల ఆదేశాలమేరకు ఈకెవైసి తహసీల్దార్, రేషన్ డీలర్, గ్రామ వార్డ్ సచివాలయం లాగిన్ లో చేసుకోవచ్చని సూచించారు.

## ఉప ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రికి ధన్యవాదాలు

**- సర్పంచ్ కత్తి లావణ్య**



**అనంతసాగరం, మార్చి22, ప్రభాతవార్త:** అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు పంచాయతీకి చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లను ఏర్పాటును చేసిన ఉపముఖ్యమంత్రి , రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి లకు ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ కత్తి లావణ్య ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా పారి శుధ్య పనుల చెత్త తరలింపు, రోడ్డు పూనులకు సోనాలిక ట్రాక్టర్ లను శనివారం పంచాయతీకి అందజేశారు. శానిటేషన్ పనులకు పంచాయతీ సిబ్బంది(పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడార్స్)అద్దెకు ట్రాక్టర్లు , ట్రైసైకిల్స్ తెచ్చుకొని వాడుకుంటుంటారు. ఫలితంగా అద్దె భారం పంచాయతీలపై పడకుండా ప్రభుత్వ సహకారంతో గ్రామ పంచాయతీకి ఇవ్వడంతో గ్రామంలోని నిరంతర చెత్త తరలింపు హైపో క్లోరైడ్ స్ప్రేయింగ్, సైడ్ కాలువల పూడికత తరలింపు , ఇతర పనులకు ఎంతో సులభతరమైందన్నారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు , జిల్లా పంచాయతీ అధికారులకు, కలెక్టర్‌గాకు పంచాయతీ సర్పంచ్ కత్తి లావణ్య, కార్యదర్శి ఎన్.పుల్లయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

## క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ గంగాధర్



**ఆత్మకూరు, మార్చి22, ప్రభాతవార్త:** శనివారం ప్రారంభమైన ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని ఆత్మకూరు సిఐ గంగాధర్ తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ , ఆత్మకూరు డియస్పీ వేణుగోపాల్ ఆదేశాలతో ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సిఐ గంగాధర్ తెలిపారు. ఆత్మకూరు సర్కిల్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో క్రికెట్ బెట్టింగుల వ్యవహారాలను పసిగట్టేంగుకు ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. అన్ని గ్రామాల్లో , పలు ప్రాంతాల్లో వారు సంచరిస్తూ బెట్టింగ్ వ్యవహారాలను గమనిస్తుంటారన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందంతోపాటు తాను, తమ ఎస్ఐలు నిరంతరం కేఫ్, టీపాయింట్లు, హోటల్స్, లాడ్జిల్లో కూడా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడేవారికోసం పరిశీలిస్తామన్నారు. తమ పిల్లల ప్రవర్థనపై తమ ఆర్థిక లావాదేవీలపై ఎద్దలు గమనించాలని సిఐ సూచించారు.

## ఆర్ ఎస్ ఆర్ లో ఘనంగా టెక్నోపల్స్ 2కె25



**బిట్రగుంట మార్చి 22 ప్రభాతవార్త :** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు "టెక్నోపల్స్ 2కె25" పేరుతో జాతీయస్థాయిలో సాంకేతిక విద్యపై ఒకరోజు సింపోసియం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సింపోసిమ్ కి జాతీయస్థాయిలో దాదాపు 1000 పేపర్ల వరకు రాగా వాటిలో మెరిట్ పేపర్లను 200 వరకు బ్రాంచ్ వైస్ సెలెక్ట్ చేసి వారిని ఆహ్వానించినట్లు తెలిపారు. అలాగే బ్రాంచ్ వైస్ అత్యంత ప్రతిభ కనపర్చిన వారిని న్యాయ నిర్ణేతలు సెలెక్ట్ చేసిన వాళ్లకు నగదు బహుమతి తో పాటు ప్రశంస పత్రాలను అందజేసినట్లు తెలియజేశారు. ఇంకా వారు ఈ కార్యక్రమం వల్ల సాంకేతిక విద్యలో విద్యార్థిని విద్యార్థులు దాగివున్న సృజనాత్మకత చురుకుదనం వంటి ప్రతిభ వెలికి తీయుటకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓఆర్వి రమణారెడ్డి, టెక్నోపల్స్ కన్వీనర్ డాక్టర్ దిలీప్ కుమార్ అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## టీబీ రహిత సమాజాన్ని నిర్మించాలి




**కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త :** టీబీ రహిత సమాజాన్ని 2026 నాటికి నిర్మించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆశయమని , అందుకు అనుగుణంగా అందరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు టీబీపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ నివారణ మన బాధ్యత, మన ధ్యేయం మన లక్ష్యం కావాలని సూచించారు. అనంతరం నేతాజీనగర్ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దిలీప్, ల్యాబ్ సూపర్‌వైజర్ దిలీప్, ఎం. సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు ఉమా, సత్యవతి, కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ రామాంజనేయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థు లు ఉన్నారు.

## ద్వనిక జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే



**కావలి, మార్చి22 ప్రభాతవార్త :** కావలి పట్టణం 1వ వార్డు తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి కొండావెంకట్రావు మనవరాలు ద్వనిక మొదటి జన్మదినోత్సవ వేడుకల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని ఆశీర్వది ంచారు. జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే దగుమాటి కట్‌చేసి చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన వెంట లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాద్యక్షుడు ప్రముఖ న్యాయవాది పోట్లూరి శ్రీనివాసులు, టిడిపి పట్టణ అద్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడూరు వృద్ధాశ్రమంలో మెడికల్ క్యాంపు



**తోటపల్లిగూడూరు, మార్చి 22, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీలోని కోడూరులో ఉన్న వృద్ధాశ్రమంలో శనివారం జిల్లా స్పెషలిస్టు డాక్టర్లచే ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమంలో సుమారు 40 మంది దాకా వృద్ధులు ఉన్నారని వారికి అందరికి ప్రత్యేకంగా షుగర్ బీపీతో పాటు అన్ని రకాల టెస్టులు ఆశ్రమ నిర్వాహకులు చేయించారు. వృద్ధులకు అవసరమైన మందులు ఇచ్చే ప్రయత్నం కూడా చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## సర్వేలను మరింత వేగవంతం చేయాలి



**సైదాపురం, మార్చి 22, ప్రభాతవార్త :** మండలంలో జరుగుతున్న వివిధ సర్వేలను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓ పురుషొత్తం శివకు మార్ తెలిపారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయంలో నిర్వహిస్తున్న సర్వేలు, సిబ్బంది హాజరు తీరుపై పంచాయతీ కార్యదర్శు లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్వేలపై మరింత ప్రగతి చూపించి హాజరు శాతం మెరుగుపరచాలని సూచించారు. అనంతరం పి-4 సర్వేకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాభివృద్ధికి సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయోగకరం




**కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతంజలి కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రొడక్ట్ డిజైన్ అండ్ డ్రాఫ్టింగ్ బై కాటియా వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సందీప్‌కుమార్ మాట్లాడుతూ కాటియా డిజైన్ సాఫ్ట్‌వేర్ విద్యార్థుల ఉద్యోగ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమల్లో వివిధ పరికరాలను డిజైన్ చేసేందుకు ఈ సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. పద్మశ్రావ్య తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఐఐసీసీ విభాగాధిపతి డాక్టర్ పి. చక్రపాణి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త జి. నీలిమా, శిక్షకులు రాంబాబు, అధ్యాపకులు , విద్యార్థులు ఉన్నారు.

## మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



**కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త :** కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వెనుకభాగంలో ఉన్న పంచాయతీ చెత్తను ఎవరో ఆకతాయిలు తగల బెట్టరు. ఈ నేపథ్యంలో శనివారం పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతం నుంచి పొగ ఆ రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యారు. ఈ నేపథ్య ంలో పరీక్షా హాల్‌లో ఇన్విజిలేటర్‌గా డ్యూటీ నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావు వెంటనే ఆ విషయాన్ని సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఆ సమాచారాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు. వెంటనే ఆయన ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి పొగలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందుకు ఎస్సై రంగనాథ్ గౌడ్‌కు, దేవిరెడ్డి సురేష్‌రెడ్డికి విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## డిజైన్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త :** సివిల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఫీల్డ్ ప్రాక్టీస్‌లో ఎదుర్కొనే పలు విషయాలపై అవగాహన కల్పించేందుకే ఈ శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ తెలిపారు. కోవూరు మండలంలోని గంగవరం గీతాంజలి కళాశాలలో శనివారం శ్రీ కృష్ణ దేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఫీల్డ్ ప్రాక్టీస్‌పై సెమినార్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. ఉమా సాయికృష్ణ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఫీల్డ్‌లో ఎదుర్కొనే సవాళ్లు, డిజైన్ ఆచరణలో పెట్టే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్కైప్ మేనేజింగ్ డైరెక్టర్ బి. సంతోష్‌రెడ్డి విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బాలు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటిని సంరక్షించుకోకపోతే మానవుల మనుగడకు ముప్పు

### కావలి ఆర్‌టిసి డిఎం రాపూరు శ్రీనివాసులు



**కావలి, మార్చి22 ప్రభాతవార్త :** నీటిని సంరక్షించుకోకపోతే మానవుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని కావలి ఆర్‌టిసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి ఆర్‌టిసి గ్యారేజ్‌లో శనివారం ప్రపంచ జలసంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచభూతాల్లో ఒకటిగా భావించే నీటిని సంరక్షించుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి నీటిని పొదుపుగా వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. వర్షపునీటిని భూగర్భంలోకి వెళ్లేందుకు తగిన చర్యలు వ్యక్తిగతంగా చేపట్టాలన్నారు. ఆర్‌టిసి గ్యారేజ్‌లో తక్కువనీటితో బస్సులను శుభ్రపరచాలని, కుళాయిలను సకాలంలో కట్టివేయాలని తెలిపారు. పైపులలో లీకేజీలను గమనించిన వెంటనే అరికట్టేచర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.కల్పనారెడ్డి మాట్లాడుతూ 1993వ సంవత్సరం నుండి ఐక్యరాజ్యసమితి సూచనలమేరకు ప్రపంచ జలసంరక్షణ దినాన్ని జరుపుకుంటున్నామన్నారు. జలాన్ని ఎవరిపరిధిలోవారు సంరక్షించాలన్నారు. భవిష్యత్తులో నీటికోసం యుద్ధాలుచేసే పరిస్థితి దాపురించవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి అద్యక్షత వహించిన గ్యారేజి ఇన్‌చార్జి ఎస్‌కె.ఖాదర్‌మొహిద్దీన్ మాట్లాడుతూ నీటి సంరక్షణలో భాగంగా గ్యారేజ్ ఆవరణంలో గ్యారేజ్ సిబ్బంది శ్రమదానంతో ఇంకుడుగుంటలు ఏర్పాటుచేయడంతోపాటు విరివిగా మొక్కలునాటి సంరక్షిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలలో భక్తులకు అవసరమైనమేరకు బస్సులు నడిపి అధిక ఆదాయం పొందినందుకు సిబ్బందికి ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ కల్పనారెడ్డి తేనేటి విందును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎం.రామకృష్ణ, స్టోర్ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వర్లు, సెక్యూరిటి అధికారి కెకె.రావు, ఎడిసి దాకారపు రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

**గ్రామ పంచాయితీ కార్యాలయము - వేగూరు, కోవూరు మండలం**
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.01/2025 తేది: 19.03.2025

**టెండర్ ప్రకటన**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు మండలము, వేగూరు గ్రామ పంచాయితీ 2025-2026 సం॥నకు చెందిన ఈ క్రింది షెడ్యూల్ లో తెలిపిన వస్తువులు సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరుబడుచున్నవి. టెండర్లులో పాల్గొనదలచిన వారు తేది 28.03.2025, శుక్రవారం ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 3-00 గంటల వరకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు హాజరుకాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ ప్రకారము ఆయా ఐటముల ఎదురుగా చూపిన దరవత్తులు చెల్లించి టెండర్లు దాఖలు చేయవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఇతర వివరములు కార్యాలయము పనిచేయువేళలలో తెలుపబడును.

| వ.నెం. | టెండర్ వివరములు | ధరావత్తు |
|---|---|---|
| 1 | తేది.01.04.2025 నుండి 31.03.2026 వరకు గ్రామ పంచాయితీ ఏరియాలో పారిశుధ్య పనులు నిర్వహణకు ప్రతి నిత్యం ఇద్దరు (02) మందిని, మంచినీటి సరఫరా నిర్వహణ స్కీము పనులు చేయుటకు (06) ఆరు, చొప్పున మొత్తం 08 (ఎనిమిది) మందిని నెలసరి వేతనముతో పనిచేయుటకు ఒక నెలకు ఒక్కరికి వేతన రేటు పొందుపరచి టెండరు దాఖలు చేయగలరు. (షరతులు వర్తించును). GO MS NO.551, Dt. 27.03.1999 మరియు GO MS NO.57, Dt.13.02.2019 నిబంధనలుకు లోబడియుండవలెను | రూ.500 |
| 2 | 2025-2026 సం॥నకు మోటారు రీవైండింగ్ మరియు రిపేర్లు చేయుటకు (అనుభవంగల మెకానిక్‌ల వారిచే) | రూ.200 |
| 3 | 2025-2026 సం॥నకు పి.డబ్ల్యు.ఎస్ స్కీమ్ విడిభాగములు దఫాలు వారిగా సప్లయి చేయుటకు | రూ.200 |
| 4 | 2025-2026 సం॥నకు పి.డబ్యా.యస్. స్కీము మోటార్లకు మరియు యల్.ఇ.డి లైట్లకు సంబంధించిన కరెంటు సామాన్లు దఫాలు వారిగా సప్లయి చేయుటకు. | రూ.200 |

**వి.హజరత్ బాబు,** పంచాయతీ కార్యదర్శి, (పూ.అ.భా),
వేగూరు గ్రామ పంచాయతీ, కోవూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

## గర్భవతులు రక్తహీనతను అధిగమించాలి డాక్టర్ రామ్‌సెంటర్ బాధ్యులు



**కావలి, మార్చి22 ప్రభాతవార్త :** గర్భవతులు రక్తహీనతను అధిగమించాలని డాక్టర్ రామ్‌సెంటర్ బాధ్యులు పిలుపునిచ్చారు. కావలి పాతవూరులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో రక్తహీనతపై గర్భవతులకు, బాలింతలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డిలు మాట్లాడారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారించుటపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పోషకాహారాన్ని మహిళలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. మహిళలు, గర్భవతులు, బాలింతలు రక్తహీనత ఉన్నవారు వీటిని తీసుకోవాలన్నారు. అనంతరం రక్తహీనతను అధిగమించడానికి ఐరన్‌పాలిక్‌సిరప్స్‌ను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమణమ్మ, జ్యోతి, సర్తాజ్, గర్భవతులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

## వేగవంతంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సర్వే



**బుచ్చి మార్చి 22 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ట్రాన్స్‌కో ఏడి సతీష్‌కుమార్ నేతృత్వంలో ట్రాన్స్‌కో ఏఇ మనోహర్ ఆయన సిబ్బందితో వేగవంతంగా సర్వే చేస్తున్నట్లు రాష్ట్ర పద్మశాలి కార్పోరేషన్ డైరక్టర్, సీనియర్ తెలుగుదేశం నాయకులు తాళ్ళ నరసింహస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యా శాఖా మంత్రి నారాలోకేష్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామి ప్రకారం ప్రభుత్వం వచ్చిన 9 నెలలకే దీనిని అమలు చేశారని అందుకు ఆయన ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేనేత కార్మికుల సమస్యల గురించి అసెంబ్లీలో గళం విప్పి మాట్లా డడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మాటల ప్రభుత్వంకాదని చేతల ప్రభుత్వం అని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చేనేత కార్మికులు, ట్రాన్స్‌కో సిబ్బంది ఉన్నారు.

## ఏఎంసీ ఎస్సీ రిజర్వేషన్ ఓసిగా మార్చిన ఎమ్మెల్యే

**- అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు**

**- ఉపాధి కార్డు పొందిన వ్యక్తికి ఏఎంసి కేటాయింపు వెల్లడించిన జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్**



**కొడవలూరు, విడవలూరు, మార్చి 22, ప్రభాతవార్త :** భారత రాజ్యాంగాన్ని కాలరాస్తూ కులాలు మార్పిడి చేస్తు వారి అనుచరులకి పదవలు కేటాయించాలని సంఘటన కోవూరు నియోజకవర్గంలో చోటు చేసుకుందని నెల్లూరు మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పేర్కొన్నారు. నార్త్ రాజుపాలెం వి సి ఆర్ అతిథి గృహంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో కులాలకు అతీతంగా అట్టడుగు వర్గాలకు పదవుల కేటాయింపుకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు కోవూరు నియోజకవర్గానికి ఏఎంసీ పదవికి ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించారు. అయితే కోవూరు శాసనసభ్యురాలు వారి అనుచరుడికి పదవి ఇవ్వాలని ఎస్సీ రిజర్వేషన్ను ఓసిగా మార్చి పదవి కట్టబెట్టాలని చూస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో కూడా ఎస్సీలు ఉన్నారు. ఒకసారి గమనించండి ఎప్పటి నుండో టిడిపి పార్టీని నమ్ముకుని ఉన్న వ్యక్తులు కూడా పార్టీలో ఉన్నారు. ఒకసారి ఆలోచించండి రిజర్వేషన్ను మార్పిడి చేసి రాజ్యాంగాన్ని ఎందుకు కారుస్తున్నారు. ఎవరికి ఏం చేస్తున్నారో ఒకసారి ఆలోచించండి అని తెలియజేశారు. ఎంతోమంది పెద్దలు కోవూరు ఏఎంసీగా 40 ఏళ్లు ఓసి రిజర్వేషన్‌తో కొనసాగారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్టీలు కొనసాగారు మరి కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు వస్తే ఎందుకు మార్పిడి చేస్తున్నారు. జిల్లాలో మంత్రులు, ఎంపీ, అధినేతలు ఏమైనారో అని ప్రశ్నించారు. విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో ఎస్సీలకు ఎల్ పి ఎస్ భూములు 91 ఎకరం 91 మందికి ఎకరం చొప్పున కేటాయిస్తే ఇప్పటివరకు ఆ భూమి ఎక్కడుందో లబ్ధిదారులు తెలియక ఎమ్మార్వో, ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి తిరుగుతున్నారు. ఆ భూములకు సంబంధించి పట్టాలు ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇవ్వకపోగా కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందినట్లు లబ్ధిదారులకు నోటీసులు జారీ అయినాయి. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో లబ్ధిదారుడు కి ఇచ్చిన కారును దర్జాగా వేసుకుని తిరుగుతున్నారు. నిన్నటి వరకు ఎమ్మెల్యే ఇంటిముందు అనుచిరుడిగా తెలుపు బోర్డుతో తిరుగుతూ ఆ విషయాన్ని డి ఐ సి అధికారికి లెటర్ పూర్వకంగా పొందుపరచడంతో మరలా పసుపు రంగు బోర్డు వేసుకుని బెజవాడ అని పేరుతో కారును ఎమ్మెల్యే ముందు ఉంచడం, ఇన్ని తప్పులు చేస్తున్న వ్యక్తికి ఎస్సీ రిజర్వేషన్ ఓసిగా మార్చి ఏఎంసి పదవి కట్టబెట్టడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డం రెడ్డి నిరంజన్ బాబు రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పోండ్ల అచ్యుత్ రెడ్డి, మండల కన్వీనర్లు అత్తిపల్లి అనూప్ రెడ్డి, షేక్ షాహుల్, చిమట శేషగిరి, కాటంరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, గాలి జ్యోతి, బొచ్చు సుప్రియ, సుబ్బరాయుడు, అనపల్లి ఉదయ భాస్కర్, దంపూరు సర్పంచ్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ జయలక్ష్మిను పరామర్శించిన ఎమ్మెల్యే



**విడవలూరు, కొడవలూరు, మార్చి 22, ప్రభాతవార్త :** కోవూరు మాజీ శాసన సభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విడవలూరు మాజీ సర్పంచ్ మాతూరు జయలక్ష్మమ్మ భర్త రామసుబ్బారెడ్డి ఇటీవల మృతి చెందాడు వారి కుటుంబాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మె ంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డిని ఫోన్‌లో పరామర్శ అలాగే నార్త్ రాజుపాలెంలో పొలం రెడ్డి నివాసంలో ఉన్న సోదరుడు వెంకటేశ్వర రెడ్డిని కూడా పరామర్శించారు.

## సర్వసాధారణంగా ప్రజా వేదిక



**విడవలూరు, మార్చి 22, ప్రభాతవార్త :** మండలంలో జరిగిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డ్వామ పీడి గంగాభవాని సమక్షంలో నిర్వహించారు. 2023 - 24 సంవత్సరానికి సంబంధించిన 908 పనులకు మండలంలోని అన్ని పంచాయతీల సంబంధించి 26 వేల 767 రూపాయలను రికవరీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని కోరిన ప్రతి ఒక్కరికి ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు కల్పించాలని పెండింగ్లో ఉన్న బిల్లులను, పని కోరిన వారికి పనులు కల్పించే విషయంలో ఎంపీడీవోకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకట్ రెడ్డి, డి.విజయలక్ష్మి ఎంపీడీవో టి.నగేష్ కుమారి, అవులయ్య, ఎస్ ఆర్ పి, డిఆర్పి, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్, పంచాయితీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఇతర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## బుచ్చిలో పెక్సెబోర్డు కూలి స్వీట్ బండి ధ్వంసం ..ఒకరికి గాయాలు




**బుచ్చి మార్చి 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలో జొన్నవాడ రోడ్డు సెంటర్‌లో గాలికి ఫ్లెక్స్ బోర్డు కూలి స్వీట్ బండి ధ్వంసం అయింది. చిన్న గాలికే ఫ్లెక్స్ బోర్డు కూలిపోవడంతో దానికింద ఉన్న కొంతమంది తప్పించుకున్నారు. స్వీట్ బండి ఓ నర్ లక్ష్మణ్‌కి రెండు కాళ్ళు గాయాలు అయ్యాయి. బు చ్చిరెడ్డిపాళెంలో ఫ్లెక్స్ కడితే ప్రోగ్రామ్ అయిపోయిన 25 రోజులకు కూడా తీయ్యకపోవడంతో సవకలు లో జు అవుతున్నాయి.గాలి తోలితే ప్రజల మీద పడు తున్నాయి. దీనిని ఎవ్వరు పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ఫ్లెక్స్‌లు ఇష్టాను సారంగా కట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. నగరపాలక పంచాయితీ కమీషనర్ దీనిపైన దృష్టి పెట్టి ఫ్లెక్స్‌లు ఇష్టాను సారంగా కట్టకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## మెప్మాకు వచ్చిన గిన్నిస్ బుక్, వరల్డ్ రికార్డు ప్రతులను పబ్లిష్ చేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు సిటీ, మార్చి 22, ప్రభాతవార్త** సంఘం సభ్యుల ఉత్పత్తులను ఆన్లైన్ మార్కెటింగ్ లక్షకు పైగా చేసినందులకు గాను మన మెప్మాకు వచ్చిన గిన్నిస్ బుక్ రికార్డు, వరల్డ్ రికార్డు ప్రతులను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పబ్లిష్ చేశారు. శనివారం నెల్లూరులో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ రివ్యూ మీటింగ్‌లో మిషన్ డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్, ప్రాజెక్టు డైరెక్టర్ మెప్మా, తదితరులు పాల్గొన్నారు.

## జేసీ ని కలిసిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 22, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌నివారి చాంబర్లో కలిసిన ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ తో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అర్హులైన గ్రేడ్1, వీఆర్వోలు కు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇవ్వాలని, అలాగే గ్రేడ్ 2, గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రేడ్ 1 వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించాలని కోరడం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానంలో జరుగుతున్న పరిణామాలు గురించి వివరించడం జరిగింది. కస్టర్ విధానం పేరుతో రెవెన్యూ విలేజ్ లకు సంబంధం లేకుండా, రెండు సచివాలయలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడంజరుగుతుంది. క్లస్టర్‌కు ఒక విఆర్ఓ ఉండేలాగా నిర్ణయం తీసుకోవడం వల్ల వీఆర్వోలుకు పని భారం పెరుగుతుంది. మరియు రెవెన్యూ సేవలు కూడా ఆలస్యం అవుతాయి, అందువలన 25,26 తేదీల్లో గౌరవ ముఖ్యమంత్రి గారితో రాష్ట్ర సచివాలయంలో జరిగే కలెక్టర్ల సదస్సులులో మీరు ఈ క్లస్టర్ విధానం గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరడం జరిగింది. అలాగే ఇతర డిపార్ట్మెంట్ వర్కులు, సర్వేలు విఆర్ఓలకు మినహాయింపిస్తూ ముఖ్యమంత్రి ఆదేశాలు నెల్లూరు జిల్లాలో అమలు చేయాలని కోరడం జరిగింది. అలాగే వీఆర్వోలు సమస్యలు పై సానుకూలంగా స్పందించి విఆర్వోలుకు సంబంధించిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రమణయ్య, నాగేశ్వర్ రావు ,తిరుమల రాజు, రాజేశ్వరి ,ముని బాబు,రవి శేఖర్, చిరంజీవి, నాగరుజు, రవీంద్ర రెడ్డి, శరవన్, అనిల్, మల్లిఖార్జున్, నిఖిల్, ఇమ్రాన్, మీరయ్య, ప్రసాద్, బాల ప్రసాద్ విఆర్వోలు పాల్గొన్నారు.

## మెప్మా సిబ్బందికి అభినందనలు తెలిపిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మార్చి 22, ప్రభాతవార్త- వైద్యం** టిడ్కో ఇళ్లలో 90శాతం మె ప్మా సభ్యులే ఉన్నారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి నా రా యణ అన్నారు. 25 జిల్లాల్లో 100 మంది మహిళా ఎంట్రప్ర యి నర్స్‌ని గు ర్తించామని ఆయన తెలిపారు. వాళ్ళని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్నామన్నారు. మంత్రి నారాయణ, మెప్మా ఎండీ టీజీ భరత్, కార్పొరేషన్ కమీ షనర్‌ను సన్మానించిన మెప్మా సిబ్బంది.

## మోడల్ స్కూల్‌గా వీఆర్‌హైస్కూల్



**నెల్లూరు, మార్చి 22, ప్రభాతవార్త-వైద్యం** నగరంలో ఎంతో ఘన చరిత్ర గల వీఆర్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శనివారం సాయంత్రం మెప్మా ఎండీ తేజ్ భరత్, జిల్లా కలెక్టర్ ఆనంద్, మున్సిపల్ కమీషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి మంత్రి వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు నడి బొడ్డులో ఉన్న వీఆర్ కళాశాలలో గతంలో మూడు షిఫ్ట్‌లో ఇంటర్, డిగ్రీ తరగతులు జరిగేవని, 6500 మంది విద్యాభ్యాసం చేసేవారని గుర్తు చేశారు.వీఆర్ హైస్కూల్, కళాశాలలో తాను కూడా విద్యాభ్యాసం చేశానన్నారు. వీఆర్ కళాశాలలో లెక్చరర్‌గా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దానని అన్నారు. 2014-19లో వీఆర్ కళాశాలలో రెసిడెన్షియల్ కళాశాల పెట్టి సుమారు 300 మంది విద్యార్థులకుఐఐటీ, ఎన్ఐటీ కోచింగ్ ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించా మ న్నారు. అటువంటి చరిత్ర ఉన్న వీఆర్ రెసిడెన్షియల్ స్కూల్ మూసివేసి దే స్కాలర్ పెట్టారన్నారు. పేద పిల్లలకు ఉత్తమ విద్యనందించేలా వీఆర్ స్కూల్‌ను తీర్చిదిద్దుతానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని, ఆ హామీని నిలబెట్టుకుంటున్నట్లు చెప్పారు. వీఆర్ హైస్కూల్ అభివృద్ధి పనులకు వజిద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెప్పారు. వీలైనంత త్వరలోనే వీఆర్ హైస్కూల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో తిరిగి ప్రారంభించి నర్సరీ నుండి ఇంటర్ వరకు నిరుపేద బిడ్డలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తామని చెప్పారు. సర్వేపల్లి కాలువ కట్ట, జాఫర్ సాహెబ్ కాలువ కట్ట మొదలైన మురికివాడలో ఉన్న నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి ఈ అధునాతన విద్యాసంస్థల్లో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ పేద విద్యార్థులకు హై క్వాలిటీ ఎడ్యుకేషన్‌తో పాటు ఉచితంగా బస్సు రవాణా సౌకర్యం, ఉదయం అల్పా హారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తామని చెప్పారు. ఈ కళాశాలలో ప్రవేశానికి నిరు పేదలైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు మెప్మా అధికారులు సర్వే చేపడుతున్నట్లు మంత్రి స్పష్టంచేశారు.ఈపాఠశాల భవనాన్ని అన్నిసౌకర్యాలతో నిర్మించి, ఇంటరా క్ట్‌బోర్డులు, ల్యాబ్స్ఏర్పాటు చేసి క్రీడా మైదా నాన్ని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జూన్ 12 లోగా వీఆర్ కళాశాల అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. మంత్రి వెంట అడిషనల్ కమీషనర్ నందన్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాలకు వెళ్లేవారు తాళాలు వేసి పోలీసు వారికి తెలపవలెను



**ఉదయగిరి, మార్చి 22, ప్రభాతవార్త** : ఉదయగిరి మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో గాని పట్టణంలో కాని పోలీసు వారు విజ్ఞప్తి మేరకు ఎవరైనా వేసవి కాలంలో సెలవులపై సొంత గ్రామాలకు వెళ్లే వారు వివాది శుభ కార్యములకు వెళ్లేవారు తాళాలు వేసిన తర్వాత పోలీసు వారికి తెలుపవలెను, అట్ల తెలిపిన యెడల ఎల్‌హెచ్ఎస్ కెమెరాలు అమర్చబడును, లేక ఇళ్లల్లో విలువైన వస్తువులను డబ్బులు గాని లేకుండా చూసుకోవాలని లేదా పక్క ఇళ్లవారికి చూస్తుండమని తెలపాలి. అట్ల చేసిన యెడల ఊరికి వెళ్ళవలెను అని పోలీసు వారు విజ్ఞప్తి చేశారు.

## మండలాన్ని అక్షరాస్యతా మండలంగా తీర్చిదిద్దాలి




**కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త** : కోవూరు మండలాన్ని పూర్తి అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేలా వీవోఏలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉల్లాస్‌కు సంబంధించి వీవోఏలకు పలు విషయాలపై అవగాహన కల్పించే కా ర్యక్రమం నిర్వహించారు. ఈ సందనర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు మండలానికి సంబ:ధించి తొలి విడతలో 39 కేంద్రాల్లో 552 మంది వయోజనులను అక్షరాస్యత లేని వారిని గుర్తించి వారందరికీ ఇటీవల కాలంలో వీవోఏల ద్వారా చదవడం, రాయడంపై ఆసక్తి కలిగించేలా వయోజనులకు అనుకూలమైన సమయాల్లో నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ 552 మందికి ఆదివారం పరీక్షలు నిర్వహించేలా వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారిని గుర్తించి ఫెయిల్ అయిన వారికి మరలా ప్రత్యేక క్లాసులు నిర్వహించి వారిని కూడా ఉత్తీర్ణులు అయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బరాజు వీవోఏలకు ఆదివారం నిర్వహించే పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్‌ను వీవోఏలకు అందజేశారు. ఈ సమీక్షలో సీసీలు రాజశేఖర్, చైతన్యబాబు, రాము, శోభ, తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి




కోవూరు, మార్చి 22 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా క్రమం తప్పకుండా టీకాలు వేసేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా ఇమ్యునేషన్ అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని టీకాలు వేసే కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వారంలో బుధ, శనివారాలు తప్పకుండా వ్యాక్సినేషన్ వేసేకార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేలా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి వారిలో రక్తహీనత తగ్గకుండా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంసీబీ రికార్డులను పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ నిరంజన్‌తో వ్యాక్సినేషన్ స్టాక్, తదితర వివరాలపై ప్రత్యేకంగా చర్చించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా వారంలో రెండు రోజులు పారదర్శకంగా నిర్వహించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని డాక్టర్ నిరంజన్‌కు సూచించారు.

## రావూస్‌లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాలపై అవగాహన సదస్సు



**నెల్లూరు, మార్చి22 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్దానిక రావూస్ డిగ్రీ కళాశాలలో శనివారం ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ వినియోగం, వాటి ఉపయోగాలు అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మదీనా వాచ్స్ ఏజన్సీ అధినేత,అంతర్జాతీయ మానవ హకుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి డాక్టర్ షేక్.ఇంతియాజ్ పాల్గొని మాట్లాడారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. యువత వారి వారి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్ది దిద్దుకునేందుకు నూతనంగా వస్తు_న్న టెక్నాలజీపై అవగాహన పెంచుకోవటం అసవరమన్నారు. రేపటి తరం పూర్తిగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌పై ఆదారపడి పనిచేయనుందని, ఇప ్పటి నుండే అందులో పూర్తిస్దాయి అవగాహన పెంచుకోవటం అవసరమన్నారు. విద్యార్దులకు ఎంతో అవసరమైన ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న రావూస్ యానమానాన్ని అభినందింఆచరు. అనంతరం వాటి ఉపయోగానలు వివరించారు. రావూస్ విద్యాసంస్దల చైర్మన్ డాక్టర్ వై.కోటేశ్వరరావు, డైరెక్టర్ వై.శివ సంకేత్‌లు మాట్లాడుతు తమ విద్యాసంస్దల్లో విద్యార్దులకు ఉత్తమమైన విద్యతోపాటూ సాంకేతికత, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వాటిపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అన్నీ విబాగల్లో చేరనుంది, దీనిని విద్యార్దులు నేర్చుకోవటం ద్వారా త్వరగా ఉపాధి అవకాశాలు పొందే ఆస్కారం ఉందన్నారు. విద్యార్దులను ఉద్యోగులుగా చేయ్యాలన్నతే తమ అభిమతమని, ఇందుకోసం తాము క్రమం తప్పకుండా అనేక ఎన్ఎంసి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని ప్రాంగణ ఎంపికలను నిర్వహించటం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి అనేక కార్యక్రమాలను మరిన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్యఅతిధిని విద్యాసంస్దల యాజమాన్యం పుష్పగు చ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్దల సిఈఓ ఎన్.శివారెడ్డి, ప్రిన్సిపాల్ సుందర్,షరీఫ్, అద్యాపకులు, అదా ్యపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన



**సైదాపురం, మార్చి 22, ప్రభాతవార్త** మండల పరిధిలోని తురిమెర్ల, గిదలూరు గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం జరిగిందనివారు తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకుని గిట్టుధర పొందాలని వారు రైతులకు సూచించారు.టీడీపీ నాయకులు పాములూరు శ్రీనివాసులునాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎల్. తేజస్వికి గౌరవప్రదమైన గుర్తింపు



**వెంకటాచలం, మార్చి 22,ప్రభాతవార్త:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యూ ) ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎల్.తేజస్వి ఎంతో గౌరవప్రదమైన గుర్తింపు లభించింది. 2025 జనవరి 26న నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించినందుకు గాను, రాష్ట్ర గౌరవనీయ గవర్నర్ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్‌గారి చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎల్. తేజస్వి విజయంతో విశ్వవిద్యాలయం గర్వించదగిన ఘనత సాధించింది. వి ఎస్ యూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రతిభ, కృషి, నిబద్ధతకు నిదర్శనం." అన్నారు.రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత మాట్లాడుతూ, "ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల తేజస్వి అందు కున్న గౌరవం, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకం." అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సి పాల్ ఆచార్య సిహెచ్. విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ శంకర్ అల్లం,ప్రోగ్రాం ఆఫీసర్,డాక్టర్ కె విద్య ప్రభాకర్ డాక్టర్ ఎస్.బి. సాయినాద్, డాక్టర్ బివిసుబ్బా రెడ్డితో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభాకాంక్షలు తెలిపారు.

## జొన్నవాడ కామాక్షితాయి సేవలో ఎస్‌బిఐ ఆర్‌ఎం దంపతులు



**బుచ్చి మార్చి 22 ప్రభాతవార్త** పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయిని ఎస్‌బిఐ ఆర్‌ఎం శ్రీనివాసమూర్తి దంపతులు దర్శించుకున్నారు. మాజీ జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ దంపతులు కూడా వారితో ఉన్నారు. శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారికి నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు ఆర్‌ఎం శ్రీనివాసమూర్తి దంపతులకు స్వామి,అమ్మవార్లు అంటే పరమభక్తి అని అన్నారు.గతంలో ఆలయానికి కూలింగ్ వాటర్ ప్రీజ్ కూడా బహుకరించారని తెలిపారు. వారితో తమకు ఎంతో అనుబంధం ఉందని వారితో కలిసి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని సుబ్రమణ్యంనాయుడు తెలిపారు.

## పవన్‌పై అభిమానంతో విశాఖ నుండి తిరుపతికి సైకిల్‌యాత్ర

### -నెల్లూరుకు చేరుకున్న అభిమాని తాతా బాబురావు



**నెల్లూరు, మార్చి22 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర డిప్యూటీ సిఎం , జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై అభిమానంతో తాతా బాబురావు విశాఖపట్నం నుండి తిరుపతికి సైకిల్‌యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర శనివారం నెల్లూరు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా జనసేన పార్టీ కోర్‌కమిటి సభ్యులు నూనెమల్లిఖార్జున యాదవ్ తాతా బావురావుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనను జిల్లా జనసేన పార్టీ ప్రదాన కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నూనె మాట్లాడుతు నిస్వార్ధ నాయకునిగా ప్రజల మనన్నలను పొందిన నేత తమ అధినేత చంద్రబాబు అని కోనియాడారు. జనసేనాని ఆశయాలు ప్రజల్లోకి తీసుకువెల్లేందుకు తాతా బావురావు సైకిల్‌యాత్ర నిర్వహించటం అభినందనీయమన్నారు. తాతా బాబురావు మాట్లాడుతు పవన్ అంటే తమకు ప్రాణం అని తెలిపారు. తమ జనసేన అధికారంలోకి వస్తే సైకిల్‌యాత్ర చేస్తామని మెకు ్కకోవటం జరిగిందని, ప్రస్తుతం మొక్కు తీర్చుకునేందుకు విశాఖ టూ తిరుపతి యాత్ర చేపట్టామని తెలిపారు. నగరంలో జనసేన నాయకులు ప్రేమ, ఆదరణ మరువలేదన్నారు. తిరుపతి వెంకేటశ్వరుని దర్శనం అనంతరం హైదరాబాద్ లోని పెద్దమ్మతల్లిని దర్శించుకుంటామని, అక్కడ నుండి మోగాస్టార్ చిరంజీవిని కలుసుకుని విశాఖపట్నం చేరుకోనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాహిత కార్యక్రమంలో సంపన్నులు బాగస్వాములు కావాలి



**బుచ్చి మార్చి 22 ప్రభాతవార్త** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో పబ్లిక్,ప్రవేటు భాగస్వా మ్యంతో అభివృద్ధి పనులు మొ దలు పెట్టడం జరిగిందని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా తెలిపారు. కౌన్సిలర్ అందె ప్రత్యూషా, తెలుగుదేశం నాయకులు రంజిత్‌తో కలిసి 3,4 వ వార్డుల పరిధిలోని ఇస్కపాళెం 2 సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిధిగా పాల్గోన్న సందర్భంగా ఆమె మాట్లాడారు. పి 4 అంటే పబ్లిక్, ప్రవేటు ,పీపుల్ బాగస్వామ్యమన్నారు. బుచ్చి పట్టణంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో పబ్లిక్ ప్రవేటు భాగస్వామ్యంతో ఇప్పటికే అభివృద్ధి పనులుమొదుల పెట్టినట్లు తెలిపారు.బుచ్చిలో జరుగుతున్న మార్కెట్ నిర్మాణం తేజో డవలపర్స్ చేస్తుందని ఇందులో భాగమేనని అన్నారు. దశాబ్దాలకు ముందే దొడ్ల,బెజవాడ ,మేనకూరు కుటుంబాలకు తమ దాతృత్వాన్ని చాటుతు ప్రజలకు అవసరమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంపన్నులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ సికిందర్, సచివాలయ సిబ్బంది పాల్గోన్నారు.

## స్మశాన స్థల ఆక్రమణలపై ఆందోళన



**ఇందుకూరుపేట, మార్చి 22, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం కొరుటూరు గ్రామ యానాది దిబ్బ గిరిజన వాసుల స్మశాన స్థల ఆక్రమణపై గిరిజనులతో పాటు రాష్ట్ర గిరిజన నాయకులు, సీపీఎం ఇతర పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై స్పందించిన ఇందుకూరుపేట మండల తహశీల్దార్ కృష్ణ ప్రసాద్ శనివారం డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్, మండల సర్వేయర్ హరినాథ్, కొరుటూరు సచివాలయ సిబ్బంది కలిసి స్మశాన వాటికను పరిశీలించారు. గిరిజనులు తమకు స్మశానాన్ని కేటాయించిన 50 సెంట్లు హద్దులు చూపించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం మీద కొరుటూరు యానాది దిబ్బ మీద గిరిజనుల సమస్యకు పరిష్కారం రానుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం స్టేట్ జాయింట్ సెక్రటరీ ఏలూరు అశోక్, మాణికుల బాబు, మాణికుల ఆదిశేషయ్య, శ్రీనివాసులు, గుడిసెమని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా విజయం సాధించండి




**నెల్లూరు మార్చి 22 ప్రభాతవార్త** విద్య విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాని సాధన కోసం ప్రణాళికా బద్ధంగా ప్రయత్నించి విజయాన్ని సాధించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారిణి పి. వెంకట లక్ష్మి పెర్కొన్నారు మలబార్ గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో శనివారం నగరంలోని స్థానిక డి.కె బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మట్లాడారు. బాలికల చదువు, మహిళాసాధికారతలు లక్ష్యంగా ఇటువంటి సహాయాన్ని అంది స్తున్న మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ను ఆమె అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 93 మందికి 8,08,000 రూపాయలను అందజేసిన మలబార్ చారిటబుల్ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ స్కాలర్ షిప్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచి, భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో కె.కుసుమకుమారి,కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కె .కొండయ్య, మలబార్ గోల్డ్ స్టోర్ హెడ్ సాహిల్, అసిస్టెంట్ స్టోర్ హెడ్ అమ్మాల్, గెస్ట్ రిలేషన్ మేనేజర్ తివారి, మార్కెటింగ్ మేనేజర్ గోకుల్, కళాశాల లెక్చరర్లు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, కరుణకుమారి, కృష్ణవేణి, వెంకట్రావు, పెంచల నరసింహం, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కోనలో వైభవంగా నృపింహుని కళ్యాణోత్సవం



**పెంచలకోన(రాపూరు), మార్చి22ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయంస్వామి వారి మూ లమూర్తికి అభిషేకం,గోపూజ,పూలాంగి సేవ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి 9.30లకు స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో కళ్యాణమహోత్సవాన్ని వేదపండితులు వేదమంత్రోఛ్ఛారణలతో,శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి ప్రాకారోత్సవం నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవనిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన వసతి,దర్శనం, బోజన, ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ,పులగల నరసింహా వెంకటసుబ్బయ్య,తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా,ఆలంకరణ కార్యక్రమాలను ఆలయ ప్రధానర్చకులు రామయ్య స్వామి,పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వినోద్ స్వామి, వెంకట బాలాజీ స్వామి,సాయి స్వామి,నాగరాజు స్వామి తదితరులు వేదమంత్రాలతో,శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## రంజాన్ తోఫా పంపిణీలో పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మార్చి 22, ప్రభాతవార్త** రంగనాయకుల పేటలో రంజాన్‌తోఫా పంపిణి కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై 300 మంది మహిళలకు రంజాన్ తోఫా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంజాన్ తోఫా పంపిణి కార్యక్రమం చేపట్టిన వైసిపి 52వ డివిజన్ ఇన్ చార్జ్ మహబూబ్ బాషాని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ పెర్నెటి కోటేశ్వర రెడ్డి, డివిజన్ కోఆర్డినేటర్ రమేష్, బి వి కే యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్,పెంచలయ్య అజుము, మూస, నూరూ, జలీల్ వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.